క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా వేకువజామున స్వామికి మేల్కొలుపు ,సుప్రభాతసేవ అనంతనం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి పట్టు వస్త్రాలను అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు.

ఆటో డ్రైవర్లకు చెక్ అందజేత



ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఏడాదికి రూ.15000 ఆర్థిక సాయం అందించే కార్యక్రమం శనివారం ఎన్ఏడీ జంక్షన్‌లో నిర్వహించారు. తొలుత గోపాలపట్నం నుంచి ఆటోలతో ఎన్ఏడీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 2212 మంది ఆటో డ్రైవర్లకు 3.14 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మన్మోహన్, జోనల్ కమిషనర్ శంకరరావు, కార్పొరేటర్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- పలువురిపై దాడి



వీధి కుక్కల దాడిలో కాలికి గాయం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడంలో అధికారులు వైఫల్యం చెందారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. కాగా శనివారం సాయంత్రం మల్కాపురం పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు ఓ వ్యక్తితో పాటు బాలుడిపై వేర్వేరు చోట్ల దాడి చేశాయి.క్షత గాత్రులు ఆస్పత్రులకు పరుగులు తీసి అవసరమైన వైద్యం చేయించుకున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామ సింహాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



రోడ్డు పక్కన పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న మహిళా సేవా మండలి సభ్యులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం రోడ్డు పక్కన ఆకలితో ఉంటున్న సుమారు 100 మంది నిరుపేదలకు బిర్యానీ, కూల్‌డ్రింక్స్ వంటి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. మహిళా సేవా మండలి చైర్‌పర్సన్ ప్రసన్న సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని పలువురు అభినందించా రు. పేదప్రజల కడుపు నింపడం కన్నా గొప్ప సేవా కార్యక్రమం మరొకటి లేదన్నారు. కార్య క్రమంలో మహిళా సేవా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా!

- అక్రమార్కుల వల్ల అందని విస్తరణ ప్రయోజనాలు
- కొందరి స్వార్థంతో రోడ్డు ఇరుకుమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు



మార్గం విస్తరించక ముందు..



రోడ్డుపై ఆక్రమణలు

మల్కాపురం: ప్రజాఅవసరాల కోసం లక్షల వ్యయంతో ఇరుగ్గా ఉన్న రోడ్డును విస్తరించారు. అయితే కొందరి స్వార్థం వల్ల విస్తరణ ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడంతో ప్రజాధనం వృథా అయిందని ప్రజలు వాపోతున్నారు. ఇరుకు మార్గంలో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ఇదీ జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కృష్ణా బార్ అండ్ రెస్టారెంట్ వెనక 30 అడుగుల వెడల్పుతో మార్గం ఉండేది. ప్రకాష్‌నగర్,జనతాకాలనీ,టీడీపీకాలనీ,అచ్చినాయుడులోవ వంటి ప్రాంతాలకు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడి వారితో పాటు మల్కాపురం,గాంధీజీవీధి తదితర ప్రాంత వాసులు కూడా ఈ మార్గం ద్వారానే ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. 2014కు ముందే ఈ మార్గం ఇరుకుగా ఉండేది. 2014 తర్వాత జన సంచారంతో పాటు వాహనాల సంఖ్య పెరగడంతో ఈ మార్గం మరింత ఇరుగ్గా మారింది.దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ఆటోలు,ట్రాక్టర్లు వంటివి పార్కింగ్ చేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వారు.అప్పుడు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ చొరవతో ఆ మార్గాన్ని 40 అడుగులుగా విస్తరించారు.అప్పట్లో సుమారు రూ.20 లక్షల వరకు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించే వారు సంతోషించారు.అయితే ఈ ముచ్చట ఎంతో కాలం లేదు.మరలా కొందరు తమ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కు చేయ్యటం,రోడ్డుపై ఇసుక,పిక్క వంటివి డంప్ చేయడంతో పరిస్థితి మొదటకి వచ్చింది. కాలువ దాటి నిర్మాణాలు చేయడంతో మళ్లీ ప్రజలు అవస్థలు పడుతున్నారు.అధికారులు స్పందించి విశాలమైన మార్గంలో వాహనాలు పార్కు చేయకుండా, రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిస్థితి మొదటికి



రోడ్డు విస్తరించక ముందు ఎలా ఉందో ప్రస్తుతం అదే పరిస్థితి ఉంది. లక్షల వ్యయంతో ఈ మార్గాన్ని విశాలం చేసినా ఫలితం లేదు.సాయంత్రం, రాత్రి అయితే చాలు ఈ మార్గంలో విపరీతమైన జన సంచారం ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ ఉండడంతో తప్పించుకుని వెళ్లడానికి చుక్కలు కనిపిస్తున్నాయి.

– నర్సింగరావు, వాహనదారుడు

కొందరి కోసం అందరికీ కష్టాలు



కొంత మంది స్వార్థం కారణంగా ఈ మార్గం ఇరుగ్గా మారుతోంది.రోడ్డుపై వాహనా లతో పాటు భవన నిర్మాణ సామగ్రి డంపింగ్ చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీటికి అధికారులు చెక్ పెట్టాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

– ఖాన్, స్థానికుడు

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి

- జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అప్పలనారాయణ



మాట్లాడుతున్న అల్లి అప్పలనారాయణ

దాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీనివల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయా లని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులోని జేపీ ఆఫ్‌షోర్‌లో పని చేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎం. కుమార మంగళం మాట్లాడుతూ నెలకు రూ. 17,524 వేతనం అయితే రూ. 14,500 ఇస్తున్నారని, 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవులు ఇవ్వడం లేదని, వీక్లీ ఆఫ్ అమలు చేయడం లేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్మికులను ఆపేయడం చట్ట వ్యతిరేకమన్నారు. జేపీ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను ఆపేసిందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ముఖ్యంగా పండగ ముందు రోజు కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపేసిందన్నారు. ఈ యాజమాన్యంపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.జగన్, నాయకులు శ్రీను, తాతలు, అచ్యుత్, తరుణ్, కొర్లయ్య, ముత్రాజు తదితరులు పాల్గొన్నారు

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లుకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం. స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.

నరవ ఐటీఐ టాపర్ రాహుల్‌కు అభినందన



రాహుల్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఐఎంసీ చైర్మన్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

కంచరపాలెం: కంచరపాలెం నరవ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్-2025 పరీక్షా ఫలితాల్లో పి.వి.ఎస్.రాహుల్ అనే విద్యార్థి డీజిల్ మెకానికల్ ట్రేడ్‌లో 594/600 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శనివారం నరవ ఐటీఐ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ బి.ప్రభాకర్, ట్రెనింగ్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి రాహుల్‌ను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రనగర్‌లో బాణసంచా తయారీ సామగ్రి స్వాధీనం

గోపాలపట్నం: స్థానికంగా చంద్రనగర్‌లో ఓ ఇంట్లో బాణసంచా తయారీ చేస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు గోపాలపట్నం పోలీసులు దాడి చేశారు. సుమారు 15,000 విలువైన బాణసంచాను పట్టుకున్నారు. చంద్రనగర్‌కి చెందిన దామోదర శివకృష్ణ కుమార్ తన ఇంట్లో తారాజువ్వలు, చిచ్చు బుడ్లు, తాటిరేకుల బాంబులు వంటివి తయారు చేస్తుంటాడు. ఇందుకోసం సిద్ధం చేసిన తయారీ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శివకృష్ణ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులకు తాజా ఆహారం అందించాలి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సందర్శించారు. పాఠశాలలో సిక్ రూమ్, సిక్ రిజిస్టర్, మందులను పరిశీలించారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన వంటి అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. ఫ్రైడే రోజున హాస్టల్‌ను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని తెలిపారు. వంట గది, డైనింగ్ హాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఆహార పదార్థాలు తాజాగా ఉన్నప్పుడే వడ్డించాలని, రక్షిత మంచినీటిని మాత్రమే విద్యార్థులకు అందివ్వాలని సూచించారు. ఆయనతో పాటు జిల్లా ఎపిడిమిక్ సిబ్బంది, మలేరియా సిబ్బంది, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘సీ’ నిధులపై ఆడిట్ జరిపించాలని వినతి

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) నిధులపై ఆడిట్ జరిపించాలని స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ అధికారులు కోరారు. ఈ మేరకు వారు శనివారం స్టీల్ ప్లాంట్ సీఎండీకి లేఖ అందజేశారు. సీ బైలాస్ ప్రకారం సహజ, అసహజ మరణానికి రూ. 5 లక్షలు అందించాలని, పదవీ విరమణ చేసిన వారికి రూ. 20 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. తొలగించిన, రాజీనామా చేసిన వారికి మాత్రమే ఈ సాయం వర్తించదని ఉన్నా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారికి కూడా వర్తించదని అసోసియేషన్ తప్పుదోవ పట్టిస్తుందని పేర్కొన్నారు. జీవితాంతం సేవ చేసి పదవీ విరమణ చేసిన తమకు బెనివలెంట్ ఫండ్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం స్పందించి నిధులపై ఆడిట్ జరిపించాలని కోరారు. దీనిపై సీ ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ బైలాస్ ప్రకారం వీఆర్ఎస్ ఉద్యోగులకు బెనివలెంట్ ఫండ్ ఉండదన్నారు. వారికి ఆ ఫండ్ చెల్లించాలంటే ప్రస్తుతం ఉన్న ప్రతీ సభ్యుడి నుంచి రూ. 3000 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై భవిష్యత్తులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

స్వచ్ఛభారత్ జీవన విధానం కావాలి



విజేతలకు బహుమతులను అందిస్తున్న అతిథులు

మల్కాపురం: స్వచ్ఛభారత్ కార్యక్రమం కాదు.., అది ఒక జీవన విధానం అని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఇన్చార్జి డైరెక్టర్ ఆచార్య కె.విజయ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛభారతావనిని ప్రపంచానికి అందివ్వడమే పూజ్య బాపూజీకి మనం ఇచ్చే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో భారీ అన్నసమారాధన



కనకదుర్గమహాలక్ష్మి ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న గణబాబు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో కనకదుర్గమహాలక్ష్మి ఆలయం వద్ద తులసి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించడం గొప్ప విషయమన్నారు. ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, నాయకులు గూడెల కృష్ణ, మంగ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సందీప్ వినాయకవర్మ (ఫైల్)

పరవాడ: పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. ఈ ప్రమాదంలో సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సాగిరాజు సందీప్ వినాయకవర్మ (27) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సందీప్ వినాయక వర్మ తన ద్విచక్ర వాహనంపై పెదముషిడివాడ నుంచి శుక్రవారం రాత్రి స్వగ్రామమైన పైడివాడ అగ్రహారానికి వెళ్తున్న క్రమంలో నక్కవానిపాలెం సమీపంలోని మలుపులో తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ వినాయక వర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కావలసి ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్పగించినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

పరవాడ: లంకెలపాలెం ఫ్లైఓవర్ సమీపంలో తాడి మూడు మదుంల వంతెన పైన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు శనివారం గుర్తించారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడం వల్ల ఆ వ్యక్తి మృతి చెంది ఉండొచ్చని జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. ఈ ప్రమాదంలో మృతుడు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. మృతుడు 5.5 ఎత్తు, నల్లటి జుట్టు, నలుపు రంగు హాఫ్ నిక్కరు కలిగి ఉన్నాడు. మృతదేహంపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. కుడి చేయి మణికట్టు వద్ద ఓం అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు 7382058996 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మి కోరారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



సింహగిరి మాడ వీధిలో భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామిని ఉదయం నుంచి సాయత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులతో దర్శనం క్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, అన్నప్రసాద భవనం, గంగధార, మాడ వీధులు కిటకిటలాడాయి. సుమారు 41 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా రూ. 30 లక్షల 98,300 ఆదాయం వచ్చింది.

జూ కిటకిట



నీటి ఏనుగుకు ఫొటోలు తీస్తున్న సందర్శకులు



సీతాకోక చిలుకల పార్కు వద్ద సందర్శకులు



తెల్ల పులిని చూస్తున్న సందర్శకులు



జూలో పెద్ద పులులు ఎన్‌క్లోజరు వద్ద సంద్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. కుటుంబాలతో సహా జూ పార్కును సందర్శించి.. ఇక్కడి వన్యప్రాణులను తిలకించారు. తెల్ల పులులు, పెద్ద పులులు, నీటి ఎనుగులు, కోతులు, ఏనుగులు, పక్షులు, పాములు, జింకలు, జిరాఫీలు తదితర జంతువులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను కనువిందు చేశాయి. వివిధ రకాల పక్షులు కిలకిలరావాలతో అలరించాయి. జూలో ఆధునికీకరించిన లవ్ బర్డ్స్ జోన్, దాని ఆనుకుని కొత్తగా నిర్మించిన డక్ యావరీ సందర్శకులను ఆకట్టుకున్నాయి.